
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 42.6 కనిష్ఠం : 38.8






ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్న సీఎం

పాలమూరు అభివృద్ధి బాధ్యత నాది



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి; చిత్రంలో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి తదితరులు



అభిమానులు ఇచ్చిన మేక పిల్లతో సీఎం రేవంత్‌రెడ్డి

- ఈ ప్రాంత బిడ్డను సీఎం చేసినందుకు ఫలితాలు చూపిస్తా..
- సీఎం కాగానే పేట- కొడంగల్ ఎత్తిపోతలకు రూ.మూడు వేల కోట్లతో శ్రీకారం
- పాలమూరుకు ఏం చేసిందని అరుణమ్మ ఓట్లు అడుగుతోంది..
- పీఆర్‌ఎల్‌ఐకి పది పైసలు నిధులు, జాతీయ హోదా తెచ్చిందా?
- అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బీజేపీ, ఇప్పుడు బీజేపీకి బీఆర్‌ఎస్ సహకారం
- నారాయణపేట కాంగ్రెస్ జన జాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



నారాయణపేటలో జరిగిన బహిరంగ సభకు వేలాదిగా హాజరైన ప్రజలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు బిడ్డ బూర్గుల రామకృష్ణారావు తర్వాత ఈ మట్టిలో పుట్టిన తనను ఆశీర్వదించి.. సీఎంగా చేసిన పాలమూరు జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి బాధ్యత తనదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తాను సీఎం అయిన కొద్ది రోజుల్లోనే నారాయణపేట, మక్తల్, కొడంగల్ ప్రాంతాల చిరకాల కోరిక అయిన ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయించి, శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జన జాతర సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కృష్ణా-వికారాబాద్ రైల్వే లైన్‌ను పది సంవత్సరాలు పడావు పెడితే.. ఈ ప్రాంతంలో ఉన్న బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు మోదీని, కేసీఆర్‌ను అడుగలేదన్నారు. అందుకు వీరికి మొఖం లేదని, అపాయింట్‌మెంట్‌కూ గతిలేదని విమర్శించారు. కానీ తాను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే అధికారులను పిలిపించి.. రైలు కూత వినని ప్రాంతాలకు రైల్వేలైన్ వేయడం ద్వారా వ్యాపార, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, కొడంగల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పడి.. వేలాది మందికి ఉద్యోగాలు వస్తాయని ఆ లైన్‌కు ఆమోదం పొందామని అన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటును పాలమూరు ప్రజలకు అందకుండా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో బీజేపీ అడ్డుకుందని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పథకాలు అమలు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలపై కేసీఆర్ ఎన్ని కేసులు పెట్టినా.. ఎంత మంది జైలుకు పంపినా.. రక్తం చెమటగా మార్చి.. భుజాలు కాయలు కాసేలా జెండాలు మోసి.. అసెంబ్లీల్లో ఎన్నికల్లో ఏడుకు ఏడు స్థానాలు గెలిపించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లకో, శ్రీమంతులకో.. జాగీర్దార్లకో.. జమీందార్లకో టికెట్లు ఇవ్వలేదన్నారు. షాద్‌నగర్ టికెట్ ఇచ్చిన వీర్లపల్లి శంకర్ రజక కుటుంబం నుంచి వచ్చారని, మక్తల్‌లో చిన్న కార్యకర్త నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా, డీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరికి ఇచ్చి గెలిపించుకున్నామన్నారు. రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 శాతం ముదిరాజుల జనాభా ఉంటే కేసీఆర్ ఒక్క టిక్కెట్ ఇవ్వలేదన్నారు. ముదిరాజ్‌లు బీసీ డీ నుంచి ఏకు మారాలంటే పార్లమెంట్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని కోరారు. రాష్ట్రంలో కురువ, యాదవ ప్రాతినిధ్యం కోసం గద్వాలలో కురువ బిడ్డ సరితకు టికెట్ ఇస్తే.. గొడవలు ఉన్నాయని చెప్పుకునే డీకే అరుణ బంగ్లా రాజకీయాలతో అల్లుడికి సహకరించి దివలాకోరుతనంతో సరిత ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు. వారికి అన్యాయం జరిగిందని వెంటనే యాదవ వర్గానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చామన్నారు. సామాజిక వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందన్నారు.



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

డీకే అరుణ ఏం చేశారు?

రేవంత్‌ను ఓడించి.. మోదీని ప్రధానిని చేయాలని అంటున్న అరుణమ్మ.. పాలమూరుకు పది పైసల నిధులు తెచ్చారా?.. జాతీయ హోదా తెచ్చారా?.. మాదిగల ఏబీసీడీ వర్గీకరణ కోసం ఏ రోజైనా ప్రధానిని కలిశారా?.. బీసీ డీ నుంచి ముదిరాజులను బీసీ ఏకు మార్చడానికి ఎవరినైనా మోదీ దగ్గరకు తీసుకెళ్లావా? అని అడిగారు. మహబూబ్‌నగర్- నారాయణపేట రోడ్డు ఎందుకు పడావు పడ్డది?, దాని కాంట్రాక్టర్లు ఎవరు.. దోపిడీ చేసిందెవరని పరిశీలించారా?, కృష్ణా-వికారాబాద్ రైల్వేలైన్ కోసం మోదీని కలిశారా?, మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి జాతీయ నిధులేమైనా తీసుకురావడానికి ప్రయత్నం చేశారా? అని ప్రశ్నించారు. మహిళలకు గ్యాస్ సిలిండర్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ నిధులు రూ.10 లక్షలకు పెంపు, పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు, నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఒక్కో దానికి 4.50 లక్షలు అంటే రూ.22,500 కోట్లు మంజూరు, 60 ఏళ్లుగా బీసీ గణన కోసం పోరాడుతుంటే.. గణన చేయాలని అసెంబ్లీలో బిల్లు పాస్ చేయడం, 126 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చినందుకా? రేవంత్‌రెడ్డిని ఓడగొట్టాలని ఆలోచిస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్‌ను ఓడగొట్టడం ద్వారా పాలమూరును ఎండగొట్టాలని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. పాలమూరు బిడ్డ సీఎం అయితే చూసి ఓర్వలేకపోతున్నారని, దొర తర్వాత ఆయన కొడుకే సీఎం కావాలా? అని ప్రశ్నించారు. పాలమూరు బిడ్డలు ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడరని, వారికి అండగా రేవంత్ అన్న ఉంటారనే ధైర్యం కల్పించామని అన్నారు. ప్రస్తుత ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సోయిలో లేరని విమర్శించారు. ఆయన కోసం పాత ఎమ్మెల్యేలు ఎవరూ ఓట్లు అడగడం లేదని ఆరోపించారు. ఒకరు రాయచూర్‌లో, ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు కాంట్రాక్టులు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఎక్కువ కష్టపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకుముందు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాలకు నీరందించేందుకు జూరాల వద్ద పాలమూరు-రంగారెడ్డి డిజైన్ చేస్తే.. కేవలం కాసుల కక్కుర్తితో కేసీఆర్ శ్రీశైలం నుంచి నీళ్లు తీసుకునేలా చేపట్టారని, కానీ ఎక్కడి పనులు అక్కడే ఉండటంతో ఇక్కడకు నీరందలేదని అన్నారు. జీవో 69 క్యాన్సిల్ చేయించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాన్ని మంజూరు చేయించారని అన్నారు.

ఎత్తిపోతలతో సస్యశ్యామలం: వంశీచంద్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మక్తల్, కొడంగల్, నారాయణపేటలో 1.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసుకున్నామని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌కు సమానంగా నారాయణపేటను కూడా సీఎం అభివృద్ధి చేస్తారని అన్నారు. నారాయణపేట జిల్లాలో సీఎం టెక్స్‌టైల్ ఏర్పాటు చేయబోతున్నారని ప్రకటించారు. కాంగ్రెస్ అభివృద్ధి ఆలోచన చేస్తుంటే.. ఎన్నికలు రాగానే గల్లీలు తిరగడానికి కొందరు వస్తున్నారని మండిపడ్డారు. తాను పుట్టిందని ఇక్కడే అంటున్న దొరసాని నారాయణపేటకు అదనంగా ఒక్క రూపాయి తెచ్చావా? అంటే చప్పుడు చేస్తలేదని అన్నారు. ఈ ప్రాంతానికి ఏదన్న ఒక్క ప్రాజెక్టు తీసుకొచ్చావా? అని ప్రశ్నించారు. ముదిరాజ్ ఎమ్మెల్యే అవ్వడం చూసి ఓర్వలేక శ్రీహరి ముదిరాజ్‌ను ఓడించి.. రామ్మోహన్‌రెడ్డికి మద్దతు ఇచ్చిన ముదిరాజ్ వ్యతిరేక దొరసానివని, సరితకు టికెట్ ఇస్తే.. ఓడగొట్టడానికి అల్లుడికి మద్దతు ఇచ్చి, యాదవ, కురుమ వ్యతిరేక దొరసాని అయ్యారని అరుణమ్మను ఉద్దేశించి అన్నారు. తనది నారాయణపేట అని చెప్పే డీకే అరుణ.. నారాయణపేటకు వచ్చిన సైనిక్ స్కూల్ పోతుంటే మాట్లాడారా?.. వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్‌కు అడిగారా? అని అన్నారు. పదవి అడుక్కున్నారే కానీ తండ్రి చిట్టెం నర్సిరెడ్డి పేరుతో నిర్మించిన సంగం బండ రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం ఇచ్చి, బండ పగులగొట్టి.. 25 వేల ఎకరాలకు నీళ్లు ఎందుకు తేలకపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.10 కోట్ల నిధులు కేటాయించి.. పనులు చేపట్టామని అన్నారు.



బహిరంగ సభకు వస్తూ అభివాదం చేస్తున్న సీఎం

సీఎంకు జిల్లా ప్రజలు రుణపడి ఉంటారు: పర్ణికారెడ్డి

నారాయణపేట: తన తాత స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి చిరకాల స్వప్నం అయిన నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూ.3,945 కోట్ల నిధులతో శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. నారాయణపేట క్రీడా మైదానంలో సోమవారం రాత్రి జరిగిన జన జాతర బహిరంగ సభకు ఆమె అధ్యక్షత వహించి, మాట్లాడారు. అస్లెంబీ ఎన్నికల ముందు ఇదే వేదికపై జీవో 69 ద్వారా రైతులకు సాగునీరు అందించి, జిల్లాను సస్యశ్యామలం చేయాలని కోరిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం సీఎం వంద రోజుల్లోనే జీవో 14 పేరుతో మంజూరు చేసినందుకు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అతి పురాతనమైన నారాయణపేట మునిసిపాలిటీకి అండర్ గ్రౌండ్ డ్రైనేజీని మంజూరు చేయాలని, కోయిలకొండ మండలంలో బోర్లు వేసినా నీరు పడనందున తాగునీటి సమస్య పరిష్కారానికి కోయిల్‌సాగర్ నీటిని మళ్లించాలని సీఎంను కోరారు. కాంగ్రెస్‌ను ఎంపీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పేదింటి బిడ్డను, ముదిరాజ్ వర్గానికి చెందిన తనకు సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే టికెట్ ఇప్పించి, గెలిపించారని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ముదిరాజులు కృషి చేయాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎడారిగా మారే ఈ ప్రాంతాన్ని పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంతో శాశ్వత సాగునీటి పరిష్కారం కోసం పాటుపడ్డ సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున పాదాభివందనాలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురున్నాథ్‌రెడ్డి, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఘన స్వాగతం

సింగారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ దగ్గర సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి స్వాగతం పలికారు.

రైతులు రోడ్డుమీద పడ్డారు

- కర్ణాటక నుంచి ఐదు టీఎంసీల నీళ్లు ఇప్పించండి
- నడిగడ్డ జలదీక్షలో మాజీ మంత్రి హరీశ్‌రావు



ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

గద్వాల, ఏప్రిల్ 15: 'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే రైతులు నడి రోడ్డుపై పడ్డారు. ఇస్తానన్న రూ.2 లక్షల రుణమాఫీ ఇవ్వలేదు. రైతు బంధు బంధు ఇవ్వలేదు. ఇప్పుడు నీళ్లను కూడా ఇవ్వడం లేదు.' అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ చౌక్‌లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నడిగడ్డ జలదీక్షకు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను నీళ్ల మంత్రిగా ఉన్నప్పుడు సమస్య రాక ముందే అప్పటి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి, నారాయణపూర్ డ్యామ్ నుంచి నీళ్లు విడిపించానని గుర్తు చేశారు. నేడు కర్ణాటకలో, ఇక్కడ రెండు చోట్లా కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, అయినా నారాయణపూర్ ప్రాజెక్టులోని 21 టీఎంసీలలో ఐదు టీఎంసీల నీటిని ఎందుకు విడుదల చేయించడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి పాలనపై ధ్యాస లేదని, పార్టీ కండువాలను కప్పేదాంట్లో బిజీగా ఉండి రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నడిగడ్డలో చివరి దశలో ఉన్న పంటలను కాపాడాలని, జిల్లా ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ఎవరైతే పొందారో వారు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, పొందని వారు బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. గద్వాలలో ప్రజల కోసం కొట్లాడే నాయకుడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఉన్నాడని, ఇంత ఎండలో కూడా మీకోసం దీక్ష చేస్తున్నాడని వివరించారు. మీ తరఫున కొట్లాడటానికి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంటుకు పంపాలని అన్నారు. ముస్లిం సోదరులు కాంగ్రెస్ మాయలో పడొద్దన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మంచి నీటి ఎద్దడి నివారణకు, పంటలను కాపాడేందుకు నారాయణపూర్ డ్యామ్ నుంచి ఐదు టీఎంసీల నీళ్లను విడిపించాలని డిమాండ్ చేశారు. దీక్షకు వివిధ కుల, వ్యాపార సంఘాలు మద్దతు తెలిపాయి. అనంతరం హరీశ్‌రావు కృష్ణమోహన్‌రెడ్డికి నిమ్మరసం అందించి, దీక్షను విరమింప చేశారు. సమావేశంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, నాయకులు అభిలాష్‌రావు, గడ్డం కృష్ణారెడ్డి, ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, విజయ్ జడ్పీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కోస్గి రూరల్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసి, ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడగాలని మాజీ మంత్రి హరీశ్‌రావ్ అన్నారు. హామీలు మరిచిపోయి మరోమారు ఓట్లు అడగడం సరి కాదని చెప్పారు. సోమవారం కోస్గిలో బీఆర్‌ఎస్ కొడంగల్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. బీజేపీ పదేళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచిందన్నారు. ఫార్మా కంపెనీ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల భూములు తీసుకుంటున్నారని ప్రజలు అంటున్నారని, అలా జరిగితే ఊరుకునేది లేదని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అసత్య ఆరోపణలు మానుకోవాలని, తాను బీఆర్‌ఎస్‌ను వీడేది లేదని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- గద్వాలలో జరిగిన రెండు చోరీ కేసులను ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్ట్.. నగదు, నగలు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన అదనపు ఎస్పీ గుణశేఖర్

గద్వాల క్రైం, ఏప్రిల్ 15: జోగుళాంబ గద్వాల జిల్లాలో గత నెలలో జరిగిన రెండు చోరీ కేసుల్లో అంతరాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి, వారి నుంచి బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నామని జిల్లా అదనపు ఎస్పీ కె.గుణశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులకు వివరాలను తెలిపారు. గత నెల 26న జిల్లా కేంద్రంలోని లింగంబాగ్ కాలనీలో ఉంటున్న రాజేష్ ఇంట్లో చోరీ జరిగింది. రెండు రోజుల ముందు కుటుంబ సభ్యులు బెంగళూరుకు వెళ్లారు. తిరిగి వచ్చాక ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. 40 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేరం జరిగిన ప్రదేశాన్ని, చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు నిందితులు కర్నూల్ నుంచి వచ్చి చోరీ చేసినట్లు తేలింది. వారే మళ్లీ అదే నెలలో గద్వాలలో దొంగతనం చేయడానికి రెక్కీ చేస్తుండగా సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా ఏ-1 మాచర్ల శ్రీకాంత్ కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్‌కు, ఏ-2 షేక్ మహ్మద్ రఫీ నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన వారుగా తెలిసింది. శ్రీకాంత్‌పై గతంలో ఎమ్మిగనూర్ పోలీస్ స్టేషన్‌లో నాలుగు కేసులు, కర్నూల్‌లో నాలుగు కేసులు, కోడుమూరులో మూడు కేసులు ఉన్నాయి. మహ్మద్ రఫీపై కూడా నంద్యాల పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు ఉంది. వీరు గతంలో జైలులో పరిచయం పెంచుకొని ఇద్దరు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా వీరిని గద్వాల సమీపంలో అరెస్ట్ చేశారు. వారి నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.నాలుగు లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి మరిన్ని నగలను రికవరీ చేయాల్సి ఉందని అదనపు ఎస్పీ తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ గుణశేఖర్

మరో కేసులో..

గత నెల 13న గద్వాలలోని ఎస్వీ ఈవెంట్ హాలులో పెండ్లి హడావుడిలో ఉండగా.. 30 తులాల బంగారు ఆభరణాలు చోరీకి అయ్యాయని కృష్ణవర్ధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ కేసు నిందితుడిని ధరూర్ మండలం నీలహళ్లికి చెందిన ప్రవీణ్‌గౌడ్‌గా సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించారు. అతన్ని ఇటీవల హైదరాబాద్‌లో పట్టుకొని విచారించారు. అతని వద్ద 20.29 తులాల బంగారాన్ని రికవరీ చేశారు. రెండు కేసుల నిందితులను అరెస్ట్ చేసి, ఇటీవలే రిమాండ్‌కు పంపించామని గుణశేఖర్ తెలిపారు. ఈ కేసులను ఛేదించడంలో ప్రతిభ చూపిన సీఐ, ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది చంద్రయ్య, ఇస్మాయిల్‌లకు ప్రత్యేక రివార్డ్ ఇస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

- కుటుంబ సమస్యలే కారణం

బిజినేపల్లి, ఏప్రిల్ 15: తల్లి చనిపోయి, కుటుంబ పోషణ భారంగా మారడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టెం గ్రామానికి చెందిన ఇండ్ల నరేందర్(22) తల్లి కొంతకాలం కిందట చనిపోయింది. ఇద్దరు తమ్ముళ్లు చిన్నవాళ్లు కావడంతో కుటుంబ పోషణ నరేందర్ మీద పడింది. అతను హైదరాబాద్‌లో ఆటో నడుపుతుండగా, తండ్రి రాంచంద్రయ్య, ఇద్దరు తమ్ముళ్లు గ్రామంలోనే ఉండేవారు. కుటుంబ పోషణ రోజు రోజుకు భారంగా మారడంతో నరేందర్ రెండు రోజుల కిందట వట్టెం వచ్చాడు. మనస్తాపంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

సలేశ్వరం జాతరకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22వ తేదీ నుండి 24న వరకు జరిగే సలేశ్వరం జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని ఎన్‌ఐసీ సమావేశమందిరంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, డీఎఫ్‌వో రోహిత్ గోపిడీ, ఇతర జిల్లా అధికారులు, సలేశ్వరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి కలెక్టర్ జాతర ఏర్పాట్లుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సలేశ్వరం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఫర్హాబాద్ నుండి లోపలికి అనుమతించడం జరుగుతుందన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తాగునీటి సరఫరాకు కొదవ లేకుండా ట్రాక్టర్లతోపాటు వీలైనన్నీ ఎక్కువ సంఖ్యలో సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, అటవీ,పోలీస్ అధికారులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌పై రైస్ మిల్లర్లతో సమీక్ష

జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ సీతారామారావు చాంబర్‌లో సీఎంఆర్(కస్టమ్ మిల్డ్ రైస్) బియ్యం సప్లయ్‌పై రైస్ మిల్లర్లతో కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24ఖరీఫ్‌కు సంబంధించి ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు తక్షణమే అప్పజెప్పాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, స్వామికుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరుతల దాడిలో గొర్రెపిల్లలు, దూడ మృతి

కోయిలకొండ, ఏప్రిల్ 15: మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని సంగనోనిపల్లి, అంకిళ్లలలో చిరుతల దాడిలో నాలుగు గొర్రె పిల్లలు, గేదె దూడ మృతి చెందినట్లు అటవీశాఖ అధికారి నరేందర్ తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి మృతి చెందిన జీవాలకు పంచనామ నిర్వహించారు. అంకిళ్లలో వెంకట్రాములు చెందిన నాలుగు గొర్రె పిల్లలు, సంగనోనిపల్లిలో అనంత్‌రెడ్డి చెందిన గేదె దూడలపై చిరుతలు దాడి చేసి చంపినట్లు తెలిపారు. చిరుతల దాడిలో మృతి చెందిన వాటికి అటవీశాఖ ద్వారా నష్ట పరిహారం అందిస్తామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ ఖాతాలోకి పెద్దమందడి వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ

ఏకగ్రీవంగా భారతి ఎన్నిక



పెద్దమందడి వైస్ ఎంపీపీగా ఎన్నికైన భారతి

పెద్దమందడి, ఏప్రిల్ 15 : వనపర్తి జిల్లా పెద్దమందడి మండల వైస్ ఎంపీపీగా భారతిని ఎన్నుకున్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమెను ఎన్నుకున్నారు. గత స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులను కైవసం చేసుకున్నది. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీపీగా ఉన్న తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో ఖాళీ ఏర్పడిన ఆ స్థానానికి వైస్ ఎంపీపీ రఘుప్రసాద్ ఎంపీపీగా ఎంపిక అయ్యారు. కొన్నిరోజుల నుంచి ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ పదవికి సోమవారం వనపర్తి ఆర్డీవో పద్మావతి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. మొత్తం 11 ఎంపీటీసీ సభ్యులకు గాను ఒక స్థానం ఖాళీగా ఉంది.

పది మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఏడుగురు హాజరయ్యారు. వైస్ ఎంపీపీకి గొరాయికుంట తండా ఎంపీటీసీ సభ్యురాలు భారతి ఒక్కరే నామినేషన్ వేశారు. మిగతా ఎంపీటీసీ సభ్యులు మద్దతు ప్రకటించారు. అనంతరం ఆర్డీవో సమక్షంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీరామ్‌రెడ్డి వైస్ ఎంపీపీగా భారతితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీవో శ్రీరాంరెడ్డి, ఎంపీపీ రఘుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు దామోదర్, సాయిభార్గవి, ఇందిరమ్మ, గిరమ్మ, అంజమ్మ, చెన్నమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

షాపుల్లో చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు



సొత్తు రికవరీని చూపిస్తున్న కొత్తకోట సీఐ

పెబ్బేరు, ఏప్రిల్ 15 : వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపల్ కేంద్రంలోని బస్టాండు సమీపంలో గత మంగళవారం పలు షాపుల్లో చోరీకి పాల్పడిన నిందితులను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో కొత్తకోట సీఐ రాంబాబుతో కలిసి ఎస్సై చోరీకి సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. కర్నూలు పట్టణం ఆరోరానగర్ కాలనీకి చెందిన విద్యార్థులు చందుమాల శివ అనే యువకుడు మరో ముగ్గురు మైనర్లతో కలిసి సోమవారం తెల్లవారు జామున రెండు స్కూటీలపై కర్నూల్ వైపు వెళ్తుండగా పెబ్బేరు బైపాస్ వద్ద వారిని పట్టుకున్నామన్నారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో అదుపులోకి తీసుకొని విచారిస్తే విషయాలు బయటపడ్డాయని తెలిపారు. వారి నుంచి రెండు స్కూటీలు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు ట్యాబ్‌లతో పాటు, రూ.3500 నగదు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు చెప్పారు. పెబ్బేరులో నాలుగు షాపుల్లో మాత్రమే చోరీ చేశారని, గద్వాలలో చోరీకి పాల్పడినట్లు సీఐ, ఎస్సై తెలిపారు. చందామాల శివపై కేసు నమోదు చేశామని, చోరీలకు పాల్పడిన వారిలో ముగ్గురు మైనర్లు ఉండడంతో వారిని మహబూబ్‌నగర్ జువైనల్ కోర్టులో హాజరుపరుస్తామని వారు వివరించారు.

చింతచెట్టుకు మంటలు

మిడ్జిల్, ఏప్రిల్ 15: ప్రమాదవశాత్తు చింతచెట్టుకు నిప్పంటుకోంది. అప్రమత్తమైన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఒకరి ఇంటిముందు ఉన్న చెత్తకు నిప్పంటించడంతో పక్కనే ఉన్న పెద్ద చింతచెట్టుకు మంటలు అంటుకున్నాయి. గ్రామస్థులు జడ్చర్ల ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి కొత్తపల్లి గ్రామానికి చేరుకొని నిప్పంటుకున్న చింతచెట్టుకు మంటలను ఆర్పివేశారు.

కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రామచంద్రయ్య, రాజేందర్‌నాయక్, రవికుమార్, ఖాజా తదితరులున్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- సీసీకుంటలో 42.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 15: భానుడు భగభగమని మండుతున్నాడు. ఎండవేడి మికి జనం అల్లాడుతున్నారు. మళ్లీ ఉమ్మడి పాలమూరు జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో పాటు వడగాడ్పులు, ఉక్కపోత పెరుగుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండ్రోజుల క్రితం 40 డిగ్రీలు నమోదైన ఉష్ణోగ్రత సోమవారం 42 డిగ్రీలు దాటింది. పలు మండలాల్లో 41 డిగ్రీలు దాటడంతో ఉష్ణోగ్రత ఒక్కసారిగి పెరిగి జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లా సీసీకుంట మండలంలో అత్యధికంగా 42.6 డిగ్రీలు నమోదుకాగా, గండీడ్‌లో 41.7, మూసాపేటలో 41.6, బాలానగర్‌లో 41.4, కోయి ల్‌కొండ, దేవరకద్రలలో 41 డిగ్రీలు, మిడ్జిల్‌లో 41, మహబూబ్‌నగర్‌లో 40.3, జడ్చర్లలో 40 డిగ్రీలు, భూత్పూర్‌లో 40.5 డిగ్రీలు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో 41.6, కల్వకుర్తిలో 40.8, కోడేరులో 40.4, అచ్చంపేటలో 40.3, వెల్దం డలో 39.9, పెద్దకొత్తపల్లిలో 39.7, నాగర్‌కర్నూల్‌లో 39.1, పదరలో 36.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వనపర్తి జిల్లా పెబ్బేరులో 41.4 డిగ్రీల ఉ ష్ణోగ్రత నమోదైంది. కొత్తకోటలో 40.8, పాన్‌గల్‌లో 40.7, శ్రీరంగాపూర్ 40.5, చిన్నం బావి 40.4, వనపర్తి 39.9, గోపాల్‌పేట, అమరచింత, ఆత్మకూరు, పెద్దమందడి 39.8, ఘణపూర్ 39.7, మదనాపురం 39.5, వీపనగండ్ల, రేవల్లి మండలాల్లో 39.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 41 డిగ్రీలు, ధరూర్‌లో 40.9, అయిజలో 40.5, ఇటిక్యాల, గద్వాలలో 40.2, అలంపూర్‌లో 40.1, కేటీదొడ్డిలో 39.9, మల్దకల్, ఉండవెల్లిలో 39.8, రాజోలిలో 39.3, మానవపాడులో 39.2, గట్టులో 38.4 డిగ్రీలు నమోదైంది. నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో 39 డిగ్రీలు, మక్తల్‌లో 33 డిగ్రీలు, నర్వలో 37 డిగ్రీలు, కృష్ణలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

తాగునీటి కొరత లేదు

- ప్రతీ రిజర్వాయర్‌లో జూలై, ఆగస్టుకు సరిపడా నీరు
- ఏ గ్రామం ఆరెంజ్ జోన్‌లో ఉండొద్దు
- ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్



రామన్‌పాడు రిజర్వాయర్ వద్ద తాగునీటి వివరాలు తెలుసుకుంటున్న పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా

వీపనగండ్ల, ఏప్రిల్ 15: వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లోని ప్రతీ రిజర్వాయర్‌లో తాగు నీటికి సరపడా నీరు పుష్కలంగా ఉందని, ఎక్కడా కొరత లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తాగునీటి నిల్వలు, ప్రజా అవసరాలు తెలుసుకునేందుకు రిజర్వాయర్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గద్వాల, వనపర్తి జిల్లాల్లోని ప్రతీ రిజర్వాయర్‌లో జూలై, ఆగస్టు నెలల వరకు సరిపడా తాగునీరు పుష్కలంగా ఉందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మోటార్లు, పైపులైన్ బోర్లు మరమ్మతులు చేయించామన్నారు. ఎంత పెద్ద లీకేజీలు వచ్చినా అధికారులు 24 గంటల్లో మరమ్మతులు చేసి, ప్రజలకు నీరు అందిస్తున్నారని చెప్పారు. ప్రతీ గ్రామానికి మిషన్ భగీరథ నీరు అందుతుందన్నారు. ప్రజలు అపోహలు పెట్టుకోవద్దని చెప్పారు. ఆయన వెంట కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఈఎంసీ కృపాకర్‌రెడ్డి, సీఈ చెన్నారెడ్డి, ఎస్ఈ వెంకటరమణ, వనపర్తి ఎస్ఈ జగన్మోహన్, ఈఈలు, డీఈలు, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఆటంకం ఉండొద్దు

మదనాపురం: వనపర్తి జిల్లాలోని రామన్‌పాడు రిజర్వాయర్‌లో జూలై, ఆగస్టు వరకు సరిపడా తాగునీరు ఉన్నందున నీటి సరఫరాలో ఆటంకం ఉండొద్దని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మదనాపురం మండలం రామన్‌పాడు రిజర్వాయర్‌ను కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌తో కలిసి పరిశీలించారు. రిజర్వాయర్ ఇన్‌టెక్ వెల్‌లను పరిశీలించారు. ఏ ఒక్క హాబిటేషన్ నీటి సరఫరాలో ఆరెంజ్ లేదా రెడ్ కేటగిరిలో ఉండటానికి వీల్లేదన్నారు. అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ చెన్నారెడ్డి, ఎస్ఈ జగన్‌మోహన్, జడ్పీ సీఈవో యాదయ్య, ఈఈలు పాల్గొన్నారు.

శ్రీశైలం తిరుగు జలాల పరిశీలన

కొల్లాపూర్: వేసవిలో జిల్లా ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి సందీప్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. సోమవారం కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు శివారులో కోతిగుండం వద్ద కృష్ణా నది తిరుగు జలాలను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి సందీప్ సుల్తానియా, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల కలెక్టర్లు ఉదయ్‌కుమార్, తేజస్ నందలాల్‌పవర్‌తో పాటు అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సంచిత గంగ్వార్, మిషన్ భగీరథ ఉన్నతాధికారులతో కలిసి సందీప్‌కుమార్ సుల్తానియా రిజర్వాయర్లలో నీటి లభ్యతను పరిశీలించారు. కృష్ణానది శ్రీశైలం బ్యాక్ వాటర్ కోతిగుండం వద్ద నీటి నిల్వలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి నీటి లభ్యత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఉదయ్‌కుమార్ నాగర్‌కర్నూల్ జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు తీసుకున్న చర్యలను ఆయనకు వివరించారు.

గల్లంతైన యువకుడికి కోసం ఎన్డీఆర్ఎఫ్ దళాల గాలింపు

బిజినేపల్లి, ఏప్రిల్ 15 : రెండు రోజుల క్రితం ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందిన లక్ష్మణ్ నాయక్ అనే యువకుడి కోసం ఎన్డీఆర్ఎఫ్ దళాలు రంగంలోకి దిగాయి. సోమవారం సాయంత్రం ఘటన స్థలం వట్టెంలోని పాలమూర్ రంగారెడ్డి రిజర్వాయర్‌లోని గుంత వద్దకు చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ దళాలు నీటిలోకి దిగి గాలింపు ప్రారంభించినట్లు ఎస్సై నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. రెండు రోజులుగా స్థానిక రిస్క్యూ టీంతో గాలించినా శవం జాడ కనిపించలేదన్నారు. దీంతో హైదరాబాద్‌లోని ఎన్డీఆర్ఎఫ్ దళాలకు సమాచారం ఇవ్వడంతో వారు యువకుడి ఆచూకీ కోసం నీటిలోకి దిగి గాలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సుబాబుల్ తోటలు దగ్ధం

- ఆరు లక్షల రూపాయల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వడ్డేపల్లి, ఏప్రిల్ 15 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమరుసు గ్రామంలోని సుబాబుల్ తోటలు సోమవారం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు శేఖర్, కోల ఈశ్వర్, రాజులకు చెందిన సుబాబుల్ తోటలో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు గ్రామానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అ ప్పటికే ఆరు లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు.

ఆరుగురి బైండోవర్

మానవపాడు, ఏప్రిల్ 15 : మండలంలోని బోరవెల్లి గ్రామానికి చెందిన ఆరుగురిని సోమవారం బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ వాహిదా కాతూన్ తెలిపారు. బోరవెల్లి గ్రామంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న గొల్ల శ్రీనివాసులును, పేకాట ఆడుతూ కోదండాపురం పోలీసులకు పట్టుబడిన ఐదుగురిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. వారికి ఐదువేల రూపాయల జరిమానా విధించి, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

మద్యం అమ్మిన కేసులో ముగ్గురు వ్యక్తులపై..

అమ్రాబాద్: గత శనివారం అమ్రాబాద్ మండల పరిధిలోని దోమలపెంట, పాతాళగంగ ఎక్సైజ్ దాడుల్లో మద్యం సీసాలు, గుడుంబా అమ్ముతూ పట్టుబడిన తిరుపతి రెడ్డి, నాగులు, రవి అనే ముగ్గురు వ్యక్తులపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు అచ్చంపేట ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. వీరిని సోమవారం మధ్యాహ్నం అమ్రాబాద్‌లో తాహసీల్దార్ సరిత సమక్షంలో బైండోవర్ చేసి రెండు లక్షల రూపాయల వ్యక్తిగత పూచీకతపై విడుదల చేసినట్లు సతీష్ కుమార్ తెలిపారు.

మహిళ అదృశ్యం

మానవపాడు, ఏప్రిల్ 15 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని చిన్నపోతులపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన కాల మల్లికార్జున్ భార్య కాల ప్రమీల (35) ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. దీంతో ఆమె భర్త తెలిసిన వారు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమడబాకుల గ్రామ చెరువులో చేపల మృతి

కొత్తకోట, ఏప్రిల్ 15 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అమడబాకుల గ్రామ శివారులోని తుర్కోని చెరువులో చేపలు మృతి చెందిన సంఘటనను మత్స్యకారులు సోమవారం గమనించారు. ఇప్పటివరకు పది క్వింటాల చేపలు మృతి చెంది నట్లు మత్స్యకారులు చిన్నబారన్న, హరికృష్ణ, ఎల్లన్న, సురేందర్, జ్ఞానేశ్వర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మిడ్జిల్, ఏప్రిల్ 15: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. సోమవారం ఎస్సై చంద్ర మోహన్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నవెల్లి గ్రామానికి మల్లయ్య, గోపాల్(45)లు ద్విచక్ర వాహనంపై జడ్చర్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గొల్లపల్లి గ్రామ శివారులోని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. దాంతో గోపాల్‌కు గాయాలయ్యాయి. ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గోపాల్ మృతి చెందాడు. మృతుడి భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంపీగా గెలిపిస్తే సైనిక్ స్కూల్ ఏర్పాటు చేస్తా

- మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



మాట్లాడుతున్న పాలమూరు బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 15 : నారాయణపేట ఆడపడుచునైన తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తానని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. సోమవారం నారాయణపేట మండలం సింగారం గ్రామంలో బూత్‌స్థాయి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ఇక్కడి నుంచి గెలిచిన వారు లాభపడ్డారే తప్ప ఈ ప్రాంత ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. నారాయణపేట ప్రజల కష్టాలు తెలిసిన మీ బిడ్డగా తనను ఆశీర్వదించాలన్నారు. ఇప్పుడు జరిగే పార్లమెంట్ ఎన్నికలు ఈ దేశానికి ప్రధాని ఎవరో నిర్ణయించేవని, ప్రజలంతా ఆలోచించి ముచ్చటగా మూడోసారి బీజేపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, మరోసారి కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతారని విమర్శించారు. కరోనా పరిస్థితులు దేశాల మధ్య యుద్ధాలతో చమురు ధరలు పెరిగినా భారతీయులకు ఏ భారం పకుండా చూశారన్నారు. ఎన్నికల తర్వాత పేట నుంచి అయోధ్యకు రెండు రైళ్లు నడుపుతామన్నారు. కృష్ణ, వికారాబాద్ రైల్వేలైన్ పూర్తి చేస్తామన్నారు. అంతకుముందు జలాల్‌పూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. చేరిన వారిలో ఎడివెళ్లి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్, నడిమిండి హన్మంతు, చంద్రప్ప, నర్సింహా, వడ్డె ఎల్లప్ప, భరత్‌కుమార్, లదక లక్ష్మప్ప, అనీల్ ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రతంగ్‌పాండు రెడ్డి, రఘువీర్ యాదవ్, పి.శ్రీనివాస్, జీకే నర్సిములు, రఘురామయ్య గౌడ్, మైబలీ, సత్య రఘుపాల్, భాస్కర్, కొండయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు సాయిబన్న, సింగారం నాయకులు నాగిరెడ్డి, బాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి

- పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ మల్లురవి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లురవి

పాన్‌గల్, ఏప్రిల్ 15 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించి, రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియమ్మ రుణాన్ని తీర్చుకుందామని నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కాగా, మల్లురవి మాట్లాడారు. మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు ముంత భాస్కర్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచు బాలస్వామి, కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్, బ్రహ్మయ్య, సింగోటం తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తాం: మంత్రి జూపల్లి

రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ అండ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం పాన్‌గల్ మండలం మల్లాయిపల్లి, చింతకుంట, దొండాయిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. కాంగ్రెస్ పార్టీపై ఎంతో నమ్మకంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేశారని, పార్లమెంటు ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జూపల్లి కోరారు. అనంతరం చింతకుంట, లింగాల గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను మంత్రి పరామర్శించారు.

ప్రణాళికాబద్ధంగా చేస్తే ఏదైనా సాధ్యమవుతుంది

పెద్దమందడి : ప్రణాళికాబద్ధంగా చేస్తే ఏదైనా సాధ్యమవుతుందని, వనపర్తిలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే శక్తి తీసుకువచ్చిన మన ఎమ్మెల్యే మేఘారెడ్డి అని నాగర్‌కర్నూల్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎమ్మెల్యే స్వగ్రామం మంగంపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యేతో కలిసి మల్లురవి మాట్లాడారు.

'బీజేపీ మేనిఫెస్టోలో ఈ ప్రాంతానికి ఏమిచ్చారు?'

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15: పదేళ్లు దేశాన్ని పరిపాలించిన బీజేపీ ప్రస్తుత ఎన్నికలో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ఈ ప్రాంత అభివృద్ధికి, సంక్షేమానికి ఎలాంటి హామీలు చేర్చకపోవడం తెలంగాణతోపాటు పాలమూరు ప్రజలను తీవ్ర నైరాశ్యానికి లోను చేసిందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. ఏ వర్గాన్ని కూడా ఈ మేనిఫెస్టో సంతృప్తి పరచలేకపోయిందని, ఏ మొహం పెట్టుకుని బీజేపీ నాయకులు ప్రజల ఓట్లను అడుగుతారని ప్రశ్నించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 70 ఏళ్లు పైబడిన వారికి రూ.ఐదు లక్షల వైద్యం అందిస్తారని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. భారతదేశంలోనే వెనుకబడిన పాలమూరుకు ఎలాంటి మేలు చేయలేదని, పాలమూరు రంగారెడ్డికి జాతీయహోదా ఇవ్వడం, బీసీలను ఉద్ధరించడానికి ఒక్క అంశం లేదన్నారు. దళితులకు వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చకుండా దళితుల ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని బలపరిచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు ఎం సురేందర్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్, సీజే బెనహర్, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆదరించి అవకాశం ఇస్తే అభివృద్ధి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్

గద్వాల టౌన్/గట్టు, ఏప్రిల్ 15 : నియోజకవర్గ ప్రజలు ఆదరించి అవకాశం ఇస్తే అభివృద్ధి కోసం నిబద్ధతతో కృషి చేస్తానని బీజేపీ నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. గడచిన పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో సాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వివిధ వర్గాలతో సోమవారం ఆయన విస్తృతంగా చర్చించారు. ఉదయం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం, స్మృతివనంలో మార్నింగ్ వాక్ చేస్తున్న వారిని కలిసి మాట్లాడారు. వారితో కలిసి కొద్దిసేపు వ్యాయామం చేశారు. అనంతరం తనను తాను పరిచయం చేసుకున్న భరత్‌ప్రసాద్ ఎమ్మెల్యే, మంత్రిగా, ఎంపీగా సేవలందించిన తన తండ్రి పోతుగంటి రాములుకు ప్రజల్లో ఉన్న మంచి పేరును నిలుపుకునేలా పని చేస్తానన్నారు. అనంతరం హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని టీ బంకు వద్దకు వెళ్లి అక్కడున్న వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రామాంజనేయులు, కౌన్సిలర్లు త్యాగరాజు, బండల పాండు, రజక జయశ్రీ, నరసింహులు, అఫ్సర్‌బాషా, రవి ఉన్నారు. అదేవిధంగా, గట్టు మండల పరిధిలోని బల్గెర గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ హాజరయ్యారు. జిల్లా



గద్వాలలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు బల్గెర శివారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, మండల అధ్యక్షుడు నాగప్ప పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ గద్వాల పర్యటన సందర్భంగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు గ్రామీణ ప్రాంత నాయకులు బీజేపీలో చేరారు. పట్టణంలోని డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండపల్లి నాయకులు రంగన్న, పరశురాం, కిష్టన్న, ఆంజనేయులు, మల్లన్న, రాఘవేంద్ర, తెనాలి రామకృష్ణ, జైపాల్, నరసింహులు పార్టీలో చేరారు. వారికి భరత్‌ప్రసాద్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు లత్తిపురం రామిరెడ్డి, తిరుమల్, చెనుగోనుపల్లె శ్రీను ఉన్నారు.

కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పండి

- ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి, ఏప్రిల్ 15 : అబద్ధపు హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 85కుపైగా క్రీడా అకాడమీలను ఏర్పాటు చేసి విద్యార్థులను క్రీడల్లో రాణించడానిక ప్రోత్సహించడం జరిగిందన్నారు. కల్వకుర్తి పట్టణంలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఆయన మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలో కుర్మిద్ద రోడ్డులో ఉన్న హోటళ్లలో స్థానికులతో కలిసి చాయ్‌పే చర్చలో పాల్గొన్నారు. హోటల్‌లో ఆర్ఎస్పీ బోండాలు వేసి ఓటర్లను ఆకట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బలపర్చి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. తాను ఎంపీగా గెలిచిన తర్వాత ఈ ప్రాంతంలో ఉన్న యువత స్వశక్తితో రాణించడానికి కావాల్సిన సదుపాయాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో గురుకులాలను



హోటల్‌లో బోండాలు వేస్తున్న డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

అభివృద్ధిపర్చి ఎంతోమంది పేద విద్యార్థులు చదువుకోవడానికి బాటలు వేయడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎముక జంగయ్య నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, ఈశ్వరయ్య, వెంకటయ్యగౌడ్, జంగయ్య, గోపి, చిన్న, మల్లేష్, సత్యనారాయణ, రామకృష్ణ, ఆనంద్‌గౌడ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, స్వేరోస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే బడుగుల జీవితాల్లో వెలుగులు సాధ్యం



ఖానాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెడనూరి దిలీపాచారి

బిజినేపల్లి, ఏప్రిల్ 15 : బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు రావాలంటే బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెడనూరి దిలీపాచారి అన్నారు. మండలంలోని ఖానాపూర్‌లో సోమవారం ఇంటింటికి తిరిగి పార్లమెంటు ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీ బలర్చిన ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిరుపేదల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి విజయవంతంగా అమలు చేస్తున్నారని వివరించారు. అయన వెంట మండల అధ్యక్షుడు భూషయ్య, జిల్లా నాయకులు నారాయణాచారి, మలిశెట్టి వెంకట్ రెడ్డి, దోమ తిరుపతి రెడ్డి, అతినారపు తిరుపతయ్య, మట్ట వెంకట్రాములు గౌడ్, దారెడ్డి కొండారెడ్డి, సింహారెడ్డి, కావలి రాములు, కపిలవాయి శేఖర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నుంచి బీఎస్పీలో చేరిక



బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ సమక్షంలో ఆ పార్టీలో చేరుతున్న మునిస్వామి

కొల్లాపూర్, ఏప్రిల్ 15 : బీజేపీ సిద్ధాంతాలు పూర్తిగా బహుజనులకు వ్యతిరేకంగా ఉన్నాయని ఇందుకు నిరసనగా ఆ పార్టీ నుంచి బీఎస్పీలో చేరుతున్నట్లు కొల్లాపూర్ నియోజకవర్గ నాయకుడు మునిస్వామి పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని బీజేపీ ఎంపీలు మారుస్తామని చెప్పడమే వారి ఆలోచన విధానానికి అద్దం పడుతుందన్నారు. సోమవారం ఆయన విలేకర్ల తో మాట్లాడుతూ తాను గత 20సంవత్సరాల నుంచి మహాత్మాజ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, కాన్షీరాం ఆశయాల సాధన కోసం బీఎస్పీలో పని చేశా నని, కొన్ని అనివార్య కారణాలతో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో చేరానన్నారు. బీజేపీ సిద్ధాంతాలు బహుజనులకు వ్యతిరేకంగా ఉండడంతో ఆ పార్టీకి రాజీనా మా చేసి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ సమక్షంలో తిరిగి బీఎస్పీలో చేరినట్లు మునిస్వామి పేర్కొన్నారు.

ప్రభుత్వ సంస్థలను అమ్మిన మోదీ ప్రభుత్వాన్ని ఓడిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 15: ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి ప్రవేటు రంగంలో రిజర్వేషన్లు లేకుండా దేశంలో సామాజిక న్యాయాన్ని సమాధి చేసిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ఓడిద్దామని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అధ్యక్షతన పూలే అంబేడ్కర్ జయంతుల సందర్భంగా సదస్సు నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, ప్రధాన కార్యదర్శి పులిజాల పరుశురాములు, నాయకులు నాగరాజు, బాలయ్య, క్రాంతికుమార్, భాస్కర్, అశోక్, శివవర్మ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే అంబేడ్కర్‌కు మనమిచ్చే నివాళి'

తాడూరు, ఏప్రిల్ 15 : ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీ ద్వారా భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని దాన్ని కాపాడుకోవడం కోసం సామాజిక ఉద్యమాలను ఉధృతం చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ అన్నారు. తాడూరు మండల పరిధిలోని అంతారం గ్రామంలో సోమవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు గోపాల్, రాము, రాజు, ఠాగూర్, ప్రభాకర్, అనిల్, స్వామి, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, మాజీ సర్పంచ్ చిన్నరాములు, అంగన్‌వాడీ టీచర్లు శారద, అరుణమ్మ, ఆశ వర్కర్ రామచంద్రమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రావు, శంకర్, చంద్రయ్య, బసవయ్య, కాంగ్రెస్ నాయకులు సురేష్, యాదయ్య, డోజర్ రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీల బకాయి వేతనాన్ని చెల్లించాలి'

తాడూరు, ఏప్రిల్ 15 : ఉపాధి కూలీల బకాయి వేతనాన్ని వెంటనే చెల్లించాలని, పని కేంద్రాల్లో తాగునీరు, నీడకు టెంట్ సౌకర్యం కల్పించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. తాడూరు మండల పరిధిలోని పొల్మూరు గ్రామంలో చెరువు కట్టపై జరుగుతున్న ఉపాధి కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. అక్కడ పని చేస్తున్న కూలీలు రెండు నెలల పెండింగ్ బిల్లులు, పని చేసిన కూలీ డబ్బులు చెల్లించలేదని వాపోయారు. గ్రామానికి సంబంధించిన కూలీలు గత సంవత్సరం పని చేసిన కూలీ డబ్బులు కూడా రాలేదని వాపోయారు. ఉపాధి కూలీలకు పని కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో జిల్లా అధికారులు, ప్రభుత్వ పెద్దలు విఫలమయ్యారని అయన అన్నారు. రాములు, నాగమణి, లక్ష్మయ్య, లక్ష్మమ్మ, రామచంద్రయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కుపై అవగాహన

కొల్లాపూర్, ఏప్రిల్ 15 : లైంగిక పునరుత్పత్తి, ఆరోగ్య హక్కు, కిశోర బాలికల హక్కులపై సోమవారం డిగ్రీ కళాశాల విద్యార్థులకు శ్రామిక వికాస కేంద్రం సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ మేనేజర్ సుప్రత్‌పాండే మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలకు, బాల్యవివాహాలకు గురి కాకుండా, సైబర్ నేరాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇటికాల రామారాజుయాదవ్, శ్రామిక వికాస కేంద్రం డైరెక్టర్ వై.లక్ష్మణ్‌రావులు మాట్లాడుతూ బాలలు లక్ష్యాన్ని ఏర్పరుచుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలి తప్ప ఎలాంటి వ్యాపకాలను పెట్టుకోవద్దన్నారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కోనేరులో అక్రమ నిర్మాణం తొలగించండి

- కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన ఎండబెట్ల గ్రామస్థులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 15: నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి చెందిన కోనేరును పూడ్చేసి నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన దండుగుల తిరుపతయ్య, చింతకుంట కళ్యాణ్, చటమోని చంద్రయ్య సోమవారం కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. చోళ్ల రాజుల కాలంలో నిర్మించిన ఆలయ కోనేరు శతాబ్దాల చరిత్ర కలిగి ఉందని, అనాది కాలంగా కోనేరులో భక్తులు స్నానం ఆచరిస్తూ వచ్చేవారని తెలిపారు. ఆలయ స్థలాన్ని అర్చకుడు నర్సింహాచారి ఇదివరకే కొంత భాగం ఆక్రమించుకోగా ప్రస్తుతం గ్రామానికి చెందిన బలిజ శివ అనే వ్యక్తి కోనేరు ప్రహరీ గోడను కూల్చి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఆలయ కోనేరును పూడ్చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్న వీరిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొని ఆలయ స్థలం, కోనేరు కాపాడాలని వారు కోరారు.

ఏబీవీపీ మండల కన్వీనర్‌గా కావలి వెంకటేశ్

తిమ్మాజిపేట, ఏప్రిల్ 15 : తిమ్మాజిపేట మండల ఏబీవీపీ కన్వీనర్‌గా స్థానికుడు కావలి వెంకటేశ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక కళాశాలలో చదువుతున్న విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, అదేవిధంగా విద్యా వ్యవస్థ శ్రేయస్సు కోసం మండల వ్యాప్తంగా తిరుగుతానని తెలిపారు.

సీతారాముల కల్యాణం చూతమురారండి

● నేడు సిర్సనగండ్లలో సీతారాముల మాస కల్యాణం

చారకొండ, ఏప్రిల్ 15: మండలంలోని సిర్సనగండ్లలో గల అయోధ్యనగర్ (గుట్ట)లో వెలసిన సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా మంగళవారం స్వామి వారి మాస కల్యాణం, బుధవారం కల్యాణోత్సవాన్ని దేవాలయ పాలకులు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

కల్యాణోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రంగారెడ్డి, నల్గొండ, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరానుండడంతో ఆలయ చైర్మన్ డేరం రామశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం చలువ పందిళ్లతో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, విద్యుత్, పార్కింగ్, గుట్టపైకి ఉచితంగా ఆర్టీసీ బస్సుల సదుపాయాలను కల్పిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం కల్వకుర్తి, దేవరకొండ, ఇబ్రహీంపట్నం, మాల్, మహేశ్వరం, షాద్‌న గర్ డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనుం ది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌ కర్యాలు కలిపిస్తున్నట్లు ఆలయ చైర్మన్ డేరం రామశర్మ తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

● బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను సోమవారం జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించకుండా సజావుగా సీతా రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు జరిగేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని అన్నారు. గుట్టపైకి ఎక్కువ వాహనాలను పంపించవద్దని ఎస్‌ఐ రాజశేఖర్‌కు సూచించారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ డేరం రామశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్‌లకు శాలువాలతో సత్కరించారు.



విద్యుత్ వెలుగుల్లో సీతారామచంద్రస్వామి ఆలయం

● భక్తులు సహకరించాలి

సీతారాముల బ్రహ్మోత్సవాలకు భక్తులు సహకరించాలని ఎస్‌ఐ రాజశేఖర్ కోరారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు, 18 మంది ఎస్‌ఐలు, 27 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 70 మంది కానిస్టేబుళ్లు, 20 మంది మహిళా కానిస్టేబుళ్లు, 15 మంది హోంగార్డులు, స్పెషల్ పార్టీ ఫోర్స్ మొత్తం 200 మంది బందోబస్తులో పాల్గొంటారని, 18 సీసీ కెమెరాలను ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవులు ముగిసేలోగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కావాల్సిన మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పడిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు, పనులు చేయించే విధానంపై సోమవారం ఐడీవోసీ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 839 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు ద్వారా మంజూరైన పనులన్నింటికి అంచనాలు రూపొందించాలన్నారు. కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో తాగునీరు, తరగతి గదుల్లో బ్లాక్ బోర్డు, కిటికీలు, తలుపులు, ఫ్యాన్లు, సీసీ కెమెరాల ఏర్పాట్లతో పాటు చిన్న చిన్న మరమ్మతులు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర పనులను స్థానికంగానే పూర్తి చేయించాలన్నారు. ప్రతి పాఠశాలకు 25వేల చొప్పున విడుదల చేసిన నిధులతో పనులన్నింటినీ పూర్తి చేయించాలని ఆదేశించారు. అన్ని పాఠశాలల మరమ్మతుల పనులను వేసవి సెలవుల కంటే ముందుగానే పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మొదటి దశలో రాగల 15రోజుల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో ఎలక్ట్రికల్, తాగునీరు, టాయిలెట్, ర్యాంపులు మొదలగు పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ పని మొదలు పెట్టేముందు పూర్తైన తర్వాత ఫొటోలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతీయ బ్యాంకుల్లో కమిటీల ఖాతాలు తెరిపించాలన్నారు. ప్రతిరోజు పనుల పురోగతిపై నివేదికలు అందజేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

చెన్నకేశవస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

తాడూరు, ఏప్రిల్ 15 : మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో ఉన్న పురాతన చెన్నకేశవ ఆలయాన్ని కూల్చి అదే స్థానంలో నూతన ఆలయాన్ని గ్రామస్థుల సహకారంతో నిర్మించడం జరిగింది. ఇందులో భాగంగానే సోమవారం ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన సైతం జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలునిర్వహించారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ వెంకటయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నరేందర్‌రెడ్డి, వినోద్, గ్రామస్థులు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని శాలువా, పూల మాలలతో సన్మానించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో సోమవారం అసంపూర్తిగా మిగిలిపోయిన బీటీ రోడ్డు పనులను నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ సమీపంలోని మలుపు నుంచి భగీరథ నీటి ట్యాంక్ వరకు గతంలో ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ఐదు కోట్లు మంజూరు చేయించి రోడ్డు విస్తరణ డివైడర్ పనులు ప్రారంభించారు. కంకర పర్చి వదిలేయడంతో ఎగిసిపడుతున్న కంకర రాళ్లతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, దుమ్ముధూళితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పనులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస్‌పల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పకీరయ్యగౌడ్ కుమారుని జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించి కార్యకర్తలతో మాట్లాడారు. డాక్టర్ మల్లురవి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లయ్యగౌడ్, శ్రీనివాస్‌బహదూర్, బాలరాజు, మాధవులు, ఉస్మాన్‌రవూఫ్, లక్ష్మీనారాయణ, దేవస్థానం, నాగసాయిలు, భాస్కర్‌గౌడ్, సహదేవ్, వరుణ్‌కుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామ మాజీ సర్పంచ్ వెంకటయ్య, ఆలయ నిర్వాహకులు

ఆసుపత్రి కార్మికుల వేతనాలు చెల్లించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 15: జిల్లా జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ నాయకులతో కలిసి జిల్లా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులను కలిసిన నరసింహ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రి ఏజెన్సీలకు బడ్జెట్ విడుదల చేసినా కార్మికులకు సకాలంలో వేతనాలు అందడం లేదన్నారు. జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న ఎస్ఎస్‌సీ ఏజెన్సీ జీవో నెంబరు 68 ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. జీవో ప్రకారం రూ.10,200 వేతనం చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.7600 చెలిస్తూ కార్మికులను మోసం చేస్తూ వారి పొట్టకొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు ఎస్ఎస్‌సీ ఏజెన్సీ అక్రమాలపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.సురేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, ఆసుపత్రి కార్మికులు బాలకిష్టమ్మ, రాధ, మణెమ్మ, గౌరమ్మ, నాగమణి, రేణుక, పీరమ్మ, మహేశ్వరి, రంజాన్‌బీ, యాదగిరి, రఘు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో కలిసి మాట్లాడుతున్న మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీడీవోకు ఉపాధి కూలీల వినతి

వంగూరు, ఏప్రిల్ 15: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వంగూరులో ఎంపీడీవో విజయభాస్కర్‌కు కూలీలతో కలిసి నాయకులు వినతి పత్రం అందజేశారు. పనిప్రదేశంలో కూలీకు కనీసవసతులు టెంట్, మెడికల్ కిట్స్, పనిముట్లు, అందుబాటులో ఉంచాలని వారు కోరారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా కూలీలకు బిల్లులు రావడం లేదని దీంతో కూలీలు ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యకం చేశాడు. రోజు వారిగా రూ.600 కూలీ ఇవ్వాలని, ఏడాదిలో 200 పనిదినాలు కల్పించాలని కోరారు. బాలస్వామి, వెంకటయ్య, పెంటయ్య, నరసింహ, బాలనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పనులను సమీక్షించిన ఎంపీడీవో

తెలకపల్లి, ఏప్రిల్ 15 : తెలకపల్లి మండల పరిధిలోని గట్టురాయిపాకుల గ్రామంలో సోమవారం ఎంపీడీవో కృష్ణయ్య నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలతో మంచినీటి సమస్య, పారిశుధ్యం, వీధిలైట్లు, ఇతర సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి ఫీల్డ్ విజిట్ చేసి ఒక వారంలో ఆ సమస్యలను క్లియర్ చేస్తామని ఎంపీడీవో కృష్ణయ్య హామీ ఇచ్చారు. గ్రామ సెక్రటరీ, ఏఈవో, ఏపీవో, టీఏ, ఎఫ్ఏ, హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా దాసుపల్లి నర్సరీ సైట్ విజిట్ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

అమ్రాబాద్ ఏప్రిల్ 15: గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అమ్రాబాద్ మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద వేసవిలో ప్రజల దహర్తిని తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌తో కలిసి ఎంపీడీవో మోహన్‌లాల్ సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ వేసవి సీజన్ ముగిసే వరకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మల్లేష్ తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి రూ.36 వేల ఆదాయం

లింగాల, ఏప్రిల్ 15: సలేశ్వరం జాతర సందర్భంగా మండల పరిధిలోని అప్పాయపల్లి ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో సోమవారం టెంకాయల విక్రయాల కోసం నిర్వహించిన వేలం పాట ద్వారా ఆలయానికి రూ.36 వేల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్రాచారీ తెలిపారు. ఈ వేలంలో పాల్గొన్న వారిలో నెల్లికుదురు శ్రీకాంత్ రూ.36 వేలకు అమ్మకాలను దక్కించుకున్నారని ఆయన తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శి సలేశ్వరం, మాజీ సర్పంచు రవీందర్‌నాయక్, శ్రీహరి, గోవర్ధన్, శివ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎల్లేని

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 15 : మండల పరిధిలోని కల్వకోల్ గ్రామానికి చెందిన పెబ్బేటి లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సోమవారం మృతు రాలి భౌతికకాయంపై పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యం కల్పించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు గువ్వ లి వెంకటయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే, నాయకులు



సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, తదితర నాయకులు

కల్వకుర్తి, ఏప్రిల్ 15 : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, పలువురు నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బచ్చు రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డిలు ఆయనను అభినందించి సన్మానించారు. అదేవిధంగా సీఎంరేవంత్‌రెడ్డిని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, పలువురు నాయకులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వెంట వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి, వెల్దండ మండల రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు ఎన్నం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, అలీ, రాంపురం శ్రీను, సమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గోదాములను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలి

తాడూరు, ఏప్రిల్ 15: ఖరీఫ్ పంట ఆరంభమవుతున్న వేళ గోదాములన్నింటినీ సిద్ధం చేసుకుని రైతులకు అవసరమైన ఎరువులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని సింగిల్‌విండో సీఈవో ఆంజనేయులను ఇన్‌చార్జి చైర్మన్ మల్లెపల్లి వెంకటరెడ్డి ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాములో వివిధ రకాల వస్తువులు ఉన్న నేపథ్యంలో వాటిని అక్కడి నుంచి వేరే గదుల్లోకి తరలించి గోదాములో రైతులకు అవసరమైన ఎరువులను సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచించారు.

నేడు కల్వకుర్తికి ఎంబీసీ చైర్మన్ రాక

కల్వకుర్తి, ఏప్రిల్ 15 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెటి జైపాల్ మంగళవారం కల్వకుర్తికి రానున్నట్లు వడ్డెర సంఘం నాయకులు తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు వెంకట స్వామి, వెంకటేశ్, కిష్టయ్య తదితరులు మాట్లాడారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వడ్డెర సంఘం నాయకులు, వడ్డెర ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని వెంకటస్వామి, రాములు, వెంకటేశ్, కిష్టయ్య, మూర్తిలు కోరారు.

ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలి

- జిల్లా శిశు సంక్షేమ అధికారి రాజేశ్వరి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా శిశు సంక్షేమ అధికారి రాజేశ్వరి

అచ్చంపేట, ఏప్రిల్ 15: ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా శిశు సంక్షేమ అధికారి రాజేశ్వరి అన్నారు. సోమవారం పట్టణంలోని బాలసందర్‌లో వికలాంగులకు ఓటు వినియోగంపై ఈవీఎంల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకుని మనకు కావాల్సిన నాయకున్ని ఎన్నుకునే అవకాశం ఈ ఓటు ద్వారా లభిస్తుందన్నారు. గ్రామాల్లో ఓటు వినియోగంపై ప్రతీ ఒక్కరు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రేఖ, సీడీపీవో దమయంతి, లక్ష్మి, ఏసీడీపీవో కమల, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు అవగాహన

ఉప్పునుంతల: మండల పరిధిలోని ఈర్వటోనిపల్లి, వెల్టూరు గ్రామంలో సోమవారం ఉపాధిహామీ పనులను డీఆర్‌డీవో ఓబులేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఉదయం వెళ్లి పనులు ముగించుకొని ఎండ తీవ్రతరం కాకముందు తిరిగి ఇంటికి రావాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏపీవో సుదర్శన్‌గౌడ్, ఈసీ కుర్మారెడ్డి, టీఏ సింగోటం, ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర్, రాములు తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

అచ్చంపేట, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఎస్ఎఫ్‌వో రంగస్వామి, అగ్నిమాపక సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ల ద్వారా సంభవించే అగ్ని ప్రమాదాలు వివిధ రకాల వాటిపై ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సిబ్బంది గోవిందు, ఇందర్ పాష, శ్రీనివాసులు, చంద్రమౌళి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

అమ్రాబాద్ ఏప్రిల్ 15: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు వినియోగించుకోవడం కోసం అమ్రాబాద్ మండల పరిధిలో వివిధ గ్రామాలలో 11నూతన పోలింగ్ కేంద్రాలు ప్రారంభం కానున్నట్లు అమ్రాబాద్ ఎంపీడీవో బీ మోహన్ లాల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్మపల్లి, చింతలోనిపల్లి, ఈదుల బావి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల భవనాలను పరిశీలించారు. ఈ కేంద్రాల వద్ద విద్యుత్, మంచినీరు, ర్యాంప్ సౌకర్యం తదితర విషయాలను ఎంపీడీవో పరిశీలించారు. ఆయన వెంట అమ్రాబాద్ పంచాయతీ కార్యదర్శి మల్లేష్, కారోబార్ అయూబ్ ఉన్నారు.

నేడు కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- కొల్లాపూర్ మునిసిపాలిటీ పీఠం కాంగ్రెస్‌దే?

కొల్లాపూర్, ఏప్రిల్ 15 : కొల్లాపూర్ మునిసిపాలిటీ బీఆర్ఎస్ చైర్‌పర్సన్ రఘుప్రోలు విజయలక్ష్మిపై కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం మంగళవారం జరగనుంది. మార్చి 21వ తేదీన కాంగ్రెస్ మునిసిపల్ కౌన్సిలర్లు కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోరుతూ అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. మునిసిపల్ నిబంధనల ప్రకారం జిల్లా రెవెన్యూ అధికారులు మునిసిపల్ అధికారులు సమిష్టి నిర్ణయాలతో ఈ నెల 16వ తేదీ రోజు కొల్లాపూర్ పట్టణంలోని నూతన గ్రంథాలయ భవనంలో అవిశ్వాస పరీక్ష నిర్వహించేందుకు తేదీ ఖరారు చేశారు. దీంతో మంగళవారం నిర్వహించే అవిశ్వాస తీర్మానంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు తమ బలాబలాలను ప్రదర్శించుకోనున్నారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మొత్తం 20వార్డులకుగాను 15 వార్డుల కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే బీఆర్ఎస్‌కు చెందిన వారు ఉండగా అందులో అవిశ్వాస పరీక్ష ఎదుర్కోనున్న మునిసిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ కూడా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. మెజార్టీ సభ్యులు కాంగ్రెస్ పార్టీలోనే ఉండటంతో కొల్లాపూర్ మునిసిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకోబోతుందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఈ నెల 14వ తేదీ రోజు క్యాంపునకు తరలివెళ్లారు. 16వ తేదీ ఉదయం నేరుగా క్యాంపు నుంచి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా నేడు జరగబోయే అవిశ్వాస తీర్మానంలో బీఆర్ఎస్‌కు చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్‌ని పదవి నుంచి దింపేందుకు కాంగ్రెస్ కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. మరో తేదీని ఖరారు చేసి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఆయన తుది నిర్ణయంపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆ పార్టీకి చెందిన నూతన మునిసిపల్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

ఇదిలా ఉండగా నూతన మునిసిపల్ చైర్మన్ ఎవరన్నా అంశం కొల్లాపూర్ పట్టణంలో తీవ్ర చర్చకు దారి తీసింది. కాంగ్రెస్ కౌన్సిలర్లంతా మంత్రి జూపల్లి నిర్ణయమే శిరోధార్యమని ఆయన సూచించిన అభ్యర్థికే తమ మద్దతు ఉంటుందని కౌన్సిలర్లు తేల్చి చెబుతున్నారు. కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్‌పీఠం కాంగ్రెస్ పార్టీలో ఎవరు దక్కించుకోనున్నారో వారం రోజులు వేచి చూడాల్సిందే.